



రాజ్‌భవన్‌లో గవర్నర్ నివాళులు



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న సీఎం, డీసీఎం

అంబేడ్కర్ ఆశయాలకు..

కట్టుబడ్డాం

- రాష్ట్రంలో భారీ విగ్రహం నిర్మిస్తాం : సీఎం
- రాష్ట్రమంతటా ఘనంగా జయంతి వేడుకలు

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దేశంలో అస్పృశ్యత నివారణ, సమానత్వం కోసం పాటుపడిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు కట్టుబడ్డామని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని విధానసౌధ ప్రాంగణంలో విగ్రహానికి పూలుచల్లి నివాళి అర్పించారు. అంబేడ్కర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించినవారు ఉన్నారన్నారు. స్వయంగా అంబేడ్కర్ ఎన్నికల్లో ఓటమికి సావర్కర్ కారణంగా ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. మనుస్మృతి సిద్ధాంతాలను పాటించేవారు ఇటీవల అంబేడ్కర్‌పై ప్రేమ చూపుతున్నట్లు నటిస్తున్నారన్నారు. అయితే రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్న వారు వారే అన్నారు. రాజ్యాంగం ద్వారా అస్పృశ్యత కనుమరుగు కావాలని అంబేడ్కర్ భావించారన్నారు. కుల వ్యవస్థ ఉండేవరకు సమానత్వం సాధ్యం కాదని, అస్పృశ్యత కొనసాగుతుందని అంబేడ్కర్ చెప్పారన్నారు. అంబేడ్కర్ లేకుంటే అందరికీ విద్య సాధ్యమయ్యేది కాదని సీఎం తెలిపారు. బడ్జెట్‌లో గాత్రం పెరిగితే సబ్‌ప్లాన్ గ్రాంట్లు పెరగాలని, కానీ బీజేపీ పాలనలో తగ్గించారని మండిపడ్డారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగానే గ్యారెంటీ పథకాలను తీసుకొచ్చామన్నారు. సారాయి వద్దు, పాఠశాల కావాలనేది దళిత సంఘర్షసమితి ఆశయంగా ఉండేదన్నారు. ఉపముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు ప్రాంతాలవారీగా రెసిడెన్షియల్ స్కూళ్లను తెరిచామన్నారు. మైసూరు యూనివర్సిటీలో రాజ్యాంగ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. బెంగళూరులో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం కంటే ఎత్తైనది నిర్మిస్తామన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్ఈ)కి అనుబంధంగా 33 పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వేదికనుంచే తొలి పోలీస్‌స్టేషన్‌కు శ్రీకారం చుట్టారు. అనంతరం 15మంది విజేతలకు అంబేడ్కర్ పురస్కారాలను ప్రదానం చేశారు. పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి, డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు గవర్నర్ నివాళి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ పూలు చల్లి నివాళి అర్పించారు. అంబేడ్కర్ దేశంలో సమానత్వం ఆకాంక్షించినవారని అభిప్రాయపడ్డారు. కాగా రాష్ట్రమంతటా అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. జిల్లాధికారి కార్యాలయాలలో, తాలూకాలోని మినీ విధానసౌధలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. అంబేడ్కర్ చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. జిల్లాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, దళిత సంఘాల ప్రతినిధులతోపాటు అన్నిశాఖల ఉద్యోగులు, ప్రజాసంఘాలు పాల్గొన్నాయి.

శాండల్‌వుడ్ సీనియర్ నటుడు

జనార్ధన్ కన్నుమూత



బ్యాంకు జనార్ధన్ (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శాండల్‌వుడ్ సీనియర్ నటుడు జనార్ధన్ (76) వయో భారంతో కన్ను మూశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 860 సినిమాలలో నటించిన జనార్ధన్ ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండేవారు. చిత్రదుర్గకు చెందిన జనార్ధన్ ఎనిమిదో తరగతినుంచే నాటకాల్లో పాల్గొనేవారు. ఆ తర్వాత జయలక్ష్మి బ్యాంకులో చేరారు. నాటకాలలో ఆసక్తి కల్గిన జనార్ధన్ ఓవైపు నాటకాలలో కొనసాగుతూనే సినిమాలవైపు వచ్చారు. ఉద్యోగం వదులుకుంటే కేవలం సినిమాల ద్వారా జీవనం సాధ్యం కాదని రెండు రంగాల్లోనూ కొనసాగారు. దీంతోనే అతడికి బ్యాంకు జనార్ధన్ అనే పేరు వచ్చింది. జయలక్ష్మి బ్యాంకు విజయా బ్యాంకులో విలీనమైంది. దీంతో పదోన్నతి పొంది విజయాబ్యాంకులో స్పెషల్ అసిస్టెంట్‌గా సేవలందించారు. 1981లో బెంగళూరుకు బదిలీపై వచ్చి సినిమాలలో ప్రవేశించారు. అతడికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బ్యాంకులో ఆఫీసర్‌గా పదోన్నతి వస్తే ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లాల్సి వస్తుందని నిరాకరించారు. కన్నడతోపాటు తెలుగు, మళయాళం, తమిళం, మరాఠీ సినిమాలలోనూ జనార్ధన్ నటించారు. కాగా మూడుసార్లు బైపాస్ సర్జరీ అయ్యింది. వందలాది సినిమాలు చేసినా ఆర్థికంగా స్థిరపడలేక ఇబ్బందులు పడేవారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జనార్ధన్ చెప్పుకొన్నారు. నటుడు జగ్గేశ్, సాధుకోకిలతోపాటు పలువురు సంతాపం తెలిపారు. కేంద్రమంత్రి కుమారస్వామి జనార్ధన్‌మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శాండల్‌వుడ్ నటీనటులు విచారం వ్యక్తం చేశారు.

ఆమోదం లభించేనా..?

- కులగణనకు కేబినెట్‌లో అంగీకారం అనుమానమే...!
- మంత్రుల్లో భిన్నాభిప్రాయాలు
- అనుకూలం, ప్రతికూలం, తటస్థం
- అందరూ ఏకతాటిపై నిలిచేరా..?



బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): విద్య, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై జరిగిన కులగణన సర్వేకు మంత్రివర్గంలో ఆమోదం లభించేనా..? అనేది చర్చనీయాంశంగా మారింది. బీసీ కమిషన్ ఛైర్మన్ 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వానికి సమర్పించిన కులగణన నివేదికను నాలుగురోజులక్రిందట జరిగిన మంత్రివర్గ సమావేశంలో స్వీకరించారు. అయితే కులగణనపై వివిధ కులాలు, మతాలకు చెందిన వారి అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. ఇది కేబినెట్‌లోని మంత్రులకూ వర్తించింది. కులగణన నివేదికను మంత్రివర్గం స్వీకరించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. 2015లో కులగణన సర్వేకు అప్పటి సీఎం సిద్దరామయ్య నిర్ణయించారు. అదే ఏడాది ఏప్రిల్ - మే నెలల మధ్యన సర్వే చేశారు. 2018 నాటికి సర్వే పూర్తయినా తదుపరి ప్రక్రియను సీఎం హోదాలో సిద్దరామయ్య కొనసాగించలేదు. అదే ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. అయితే జేడీఎస్ సహకారంతో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. కుమారస్వామి ముఖ్యమంత్రి అయినా సిద్దరామయ్య ప్రభుత్వానికి సమన్వయకర్తగా ఉన్నారు. 18నెలలపాటు సంకీర్ణ ప్రభుత్వం కొనసాగినా కులగణనపై ప్రస్తావించలేదు. ఆ తర్వాత మూడున్నరేళ్ల బీజేపీ పాలనలో యడియూరప్ప, బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నారు. వారు కులగణనకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకోలేదు. 2023లో మరోసారి కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీ సాధించి సిద్దరామయ్య రెండోసారి సీఎం అయ్యారు. ఆయన కులగణన సర్వేను ఆమోదిస్తారనే ప్రచారం సాగింది. కాగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కులగణన సర్వే జరుపుతామని హామీ ఇచ్చింది. అయితే సర్వే ముగిసి పదేళ్లు అవుతున్నా ఎందుకు అమలు చేయలేదనే ప్రస్తావన తెరపైకి వచ్చింది. ఇప్పుడు కేవలం కొన్ని వర్గాల కోసమే ప్రస్తావన తెస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

కులగణన నివేదిక ప్రకారం ఎస్సీల తర్వాత ముస్లింలు అధికంగా ఉన్నారనేది స్పష్టమైంది. దీంతో జనాభా ప్రకారం ముస్లింలకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాల్సి ఉంటుంది. ఓబీసీలలో ప్రస్తుతం 32శాతం రిజర్వేషన్ ఉండగా కొత్తగా 52కు పెంచాలనేది సర్వే ద్వారా సిఫారసు ఉంది. ఇలా కులగణన నివేదికను ఆమోదించి ప్రభుత్వం ముందుకెళ్లడం అంత సులువు కాదనిపిస్తోంది. పైగా మంత్రుల్లో కులగణనపై భిన్నాభిప్రాయాలు మొదలయ్యాయి. వారిలో వ్యతిరేకిస్తున్నవారు, తటస్థంగా ఉండేవారు కీలకులుగా ఉన్నారు. ఇలా అందరినీ సమన్వయపరచడం అంత సులువైనది కాదు. కాంగ్రెస్‌లో ఒకరిద్దరు ఎమ్మెల్సీలను ఎంపిక చేయాలన్నా, బోర్డులు, కార్పొరేషన్లకు ఛైర్మన్‌లను నియమించాలన్నా అధిష్ఠానం అనుమతి లేకుండా కదల్లేని పరిస్థితి ఉంది. రాష్ట్రకాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ నిర్ణయమైనా సీఎం సిద్దరామయ, డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. ఖర్గే రాష్ట్రానికి చెందినవారు కావడంతో ఆయన ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కులగణనకు అనుకూలంగా ఉండే మంత్రులలో పరమేశ్వర్, కేహెచ్ మునియప్ప, కేజే జార్జ్, సతీశ్ జార్కిహొళి, మహదేవప్ప, ప్రియాంకఖర్గే, జమీర్ అహ్మద్‌ఖాన్, ఆర్‌బీ తిమ్మాపుర, కే వెంకటేశ్, శివరాజ్ తంగడగి, సంతోష్‌లాడ్, కేఎన్ రాజణ్ణ, బైరతి సురేశ్ ఉన్నారు. ఇక వ్యతిరేకించే వర్గంలో ఎస్ఎస్ మల్లికార్జున, ఎంబీ పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె, శివానందపాటిల్, శరణబసప్ప దర్శనాపుర, లక్ష్మీ హెబ్బాళ్కర్‌తో పాటు డీసీఎం డీకే శివకుమార్ కూడా ఉన్నారు. తటస్థంగా ఉండేవారిలో హెచ్‌కే పాటిల్, రామలింగారెడ్డి, దినేశ్ గుండూరావు, కృష్ణబైరేగౌడ, చలువరాయస్వామి, డీ సుధాకర్, మంకాళవైద్య, మధుబంగారప్ప, ఎన్ఎస్ బోసరాజు ఉన్నారు.



వ్యతిరేకించే వర్గంలో డీకే శివకుమార్ మినహా మిగిలిన వారంతా వీరశైవలింగాయత సామాజిక వర్గానికి చెందినవారు. ఇక మద్దతు ఇస్తున్నవారంతా సీఎం సిద్దరామయ్యకు అత్యంత ఆప్తులుగా ముద్రపడినవారే. తటస్థుల మంత్రులు అధిష్ఠానం కోటాలో ఉండేవారు. సీఎం సిద్దరామయ్యకు అందరూ ఆప్తులే అనిపించినా వారి సామాజికవర్గాలను వ్యతిరేకించుకుని ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఈనెల 17న కేబినెట్‌లో ఎటూ తేల్చలేని అభిప్రాయాలు అప్పుడే వ్యక్తం అవుతున్నాయి. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ సోమవారం రామనగరలో మాట్లాడుతూ రాజ్యాంగంలో అన్ని కులాలు ఒక్కటైనప్పుడు కులగణన ఎందుకన్నారు. దేశంలో కులాలు, మతాల మధ్య బేధాభిప్రాయాలు ఉండరాదని డాక్టర్ అంబేడ్కర్ ఆశించారన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి చిక్కమగళూరులో మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా ముస్లింలు అయితే వారు మైనారిటీలు ఎలా అవుతారని ప్రశ్నించారు.

తేనెతుట్టె కదిలించినట్లే..

కులగణనను ఆమోదిస్తే రిజర్వేషన్ల మార్పులు అనివార్యమవుతాయి. జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతుంది. పైగా కులగణన సర్వే సమంజసంగా లేదని, అశాస్త్రీయంగా సాగిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని వీరశైవ మహాసభ, లింగాయత సామాజికవర్గానికి చెందిన స్వామిజీలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. రాష్ట్రంలో ప్రభావితమైన సామాజిక వర్గం కావడం, అంతకుమించి వీరశైవలింగాయత మఠాలు వందల సంఖ్యల్లో ఉండడంతో వారంతా తిరగబడితే పరిస్థితి ఎక్కడికి పోతుందో అనే సందిగ్ధంలో ప్రభుత్వం ఉంది. పార్టీలు వేరైనా 35మంది వీరశైవ లింగాయత ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా కులగణన విషయంలో ఒకే తాటిపైకి వచ్చే అవకాశాలు లేకపోలేదు. మరోవైపు బీజేపీ ప్రభుత్వంలో మతానికి రిజర్వేషన్ సమంజసం కాదని, ముస్లింలకు అమలులో ఉన్న 4శాతాన్ని రద్దు చేసి లింగాయత, ఒక్కలిగలకు కేటాయించారు. అయితే న్యాయ పరంగా సమస్యలు తలెత్తాయి.





కిటకిటలాడుతున్న మెజస్టిక్ మెట్రో స్టేషన్

మెట్రో కిటకిట..!

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మెట్రో ప్రయాణం చుక్కలు చూపించింది. అంబేడ్కర్ జయంతి ప్రభుత్వ సెలవుదినంగా భావించి బెంగళూరు మెట్రో కార్పొరేషన్ సోమవారం రైళ్లను కుదించింది. అయితే వారంలో తొలిరోజు కావడం, ఐటీ అనుబంధ సంస్థలు పనిచేస్తుండడం, వారాంతంకోసం సొంతూళ్లకు వెళ్లిన వేలాది మంది నగరానికి వెనుదిరిగి రావడం వంటి కారణాలతో మెట్రో రైళ్లు కిటకిటలాడాయి. మెజస్టిక్ మెట్రో స్టేషన్‌లో వేలాది మంది తరలివచ్చారు. సాధారణంగా పీక్ వేళల్లో 3-5 నిమిషాలకు ఒక మెట్రో రైలు సంచరిస్తుంది. సోమవారం 10-15 నిమిషాలకు ఒక రైలు వచ్చేలా నిర్ణయించారు. ఈ ప్రభావం మెజస్టిక్ మెట్రో స్టేషన్‌లో స్పష్టంగా కనిపించింది. బీఎంఆర్‌సీఎల్ తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు. నెటిజన్లు బీఎంఆర్‌సీఎల్ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తోపులాటలో చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారని వాపోయారు. ఎవరికైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత బయ్యప్పనహళ్ళి నుంచి మెజస్టిక్‌కు 4 మెట్రో రైళ్లను సమకూర్చారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రతి 5 నిమిషాలకు ఒక మెట్రో సంచారం ఉంటుందని బీఎంఆర్‌సీఎల్ అధికారులు ప్రకటించారు.

కేరళలో దొరికిన నిందితుడు

సుద్దగుంటపాళ్యలో యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన దుండగుడి అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని సుద్దగుంటపాళ్యలో యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిని కేరళరాష్ట్రంలోని ఓ గ్రామంలో అరెస్టు చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో సుద్దగుంటపాళ్య పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈనెల 3న తెల్లవారుజామున ఇద్దరు యువతులు నడిచి వెళ్తుండగా గమనించిన వ్యక్తి వారిని అడ్డగించి ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. సదరు వీడియోలు సీసీటీవీ ఫుటేజీల ద్వారా వెలుగులోకి వచ్చాయి. సుద్దగుంటపాళ్య పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడు మొబైల్ స్విచ్చాఫ్ చేసి పరారీ అయ్యాడు. 1600కుపైగా సీసీ కెమెరాలను పరిశీలించి ఆచూకీ తెలుసుకున్నారు. కేరళలోని ఓ పల్లెలో తలదాచుకున్న సంతోష్ డేనియెల్ (26)ను అరెస్టు చేశారు. ఇతను బెంగళూరు వీడి అతడి స్నేహితుడి ఇంట్లో గడుపుతున్నట్లు గుర్తించారు. నేరాన్ని అంగీకరించాడని పోలీసులు తెలిపారు. బెంగళూరు నుంచి హోసూరు, కృష్ణగిరి మీదుగా ప్రయాణించాడని ఆ తర్వాత కేరళకు వెళ్లాడు. గతంలో కలసి పనిచేసిన ఓ స్నేహితుడి ఇంట్లో తలదాచుకున్నాడు. సుద్దగుంటపాళ్య వాసి లోకేశ్‌గౌడ ఫిర్యాదు మేరకు విచారణ జరిపామని, బైక్ ఆధారంగా వివరాలు తెలిశాయన్నారు.

లంచం వివాదం..

మాజీ ఎమ్మెల్యే మాడాల్ కుమారుడికి క్లీన్‌చిట్

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) ఛైర్మన్ హోదాలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే మాడాల్ విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్ మాడాల్‌పై దాఖలైన లంచం కేసులో లోకాయుక్త ప్రత్యేక న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇచ్చింది. ప్రశాంత్ మాడాల్ జలమండలిలో ఆర్థిక సలహాదారుడిగా ఉద్యోగం చేస్తున్నారు. కేఎస్‌డీఎల్‌కు అవసరమైన సుగంధద్రవ్యాలు తదితర సామగ్రి సమకూర్చేందుకు తండ్రి తరఫున ప్రశాంత్ రూ.40లక్షలు లంచం తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. 2023 మార్చి 2న క్రిసెంట్ రోడ్డులోని యూనిస్ క్వేర్ బిల్డర్స్‌లోని ప్రశాంత్ కార్యాలయం నుంచి రూ.40లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సదరు కేసులో ఇటీవల విచారణ జరిపిన లోకాయుక్త న్యాయస్థానం విచారణ జరిపింది. వాస్తవాలను పరిశీలిస్తే ప్రశాంత్ వద్ద నగదు పట్టుబడిన మాట వాస్తవమేనని, అయితే అతడు లంచం డిమాండ్ చేసినట్టుగానీ, తీసుకున్నట్టుగానీ ఆధారాలు లేవనితేల్చింది. దీంతో ప్రశాంత్‌మాడాల్‌కు ఉపశమనం లభించినట్లయ్యింది.

ఆర్టీపీఎస్‌లో అగ్ని ప్రమాదం

- నాలుగో యూనిట్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్
- రెండు కేంద్రాల్లో తగ్గిపోయిన ఉత్పత్తి





ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి చెలరేగుతున్న అగ్నిజ్వాలలు

రాయచూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాలోని శక్తినగర్ థర్మల్ విద్యుత్ కేంద్రం ఆర్టీపీఎస్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి నాల్గవ యూనిట్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగసిపడడంతో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయింది. దీంతో విద్యుత్ కేంద్రంలోని నాల్గవ యూనిట్‌లో ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. 210 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ యూనిట్ ఒక్కసారిగా ఆగిపోవడంతో జిల్లాలో విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. 8 యూనిట్‌లు ఉన్న శక్తినర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే మూడు యూనిట్‌లలో ఉత్పత్తి నిలిచిపోగా నాల్గవ యూనిట్‌లోను ప్రమాదం జరిగింది. ఉత్పత్తి నిలిచిపోవడంతో అధికారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పాటు యరమరస్ థర్మల్ విద్యుత్ కేంద్రం వైటీపీఎస్‌లోను ఓ యూనిట్‌లో బొగ్గు నిల్వలు లేకపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. కాగా మంటల ద్వారా ఆర్టీపీఎస్‌లో ఏ మేరకు నష్టం జరిగిందన్న దానిపై అధికారులు సోమవారం పరిశీలించారు.

పేకాటలో డబ్బుకోసం గొడవ..

ఇద్దరి హత్య

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పేకాటలో జరిగిన గొడవలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. తాలూకాలోని ముంగానహళ్ళి హోబళి బట్లహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలో బట్లహళ్ళి గ్రామం జనతాకాలనీలో ఈ సంఘటన జరిగింది. చిక్కబళ్లాపుర పోలీసులు తెలిపిన వివరాల మేరకు బట్టల వ్యాపారం చేసే కృష్ణప్ప తమ్ముడు లింగమయ్య (40), మరో వ్యక్తి ప్రతాప్(42) మృతి చెందారు. కృష్ణప్ప కుమారుడు 20ఏళ్ల సాగర్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం రాత్రి రెండు వర్గాల మధ్య పేకాట అనంతరం రూ.5వేల కోసం గొడవ జరిగింది. వంశీ, జాన్‌బాబు, సాయినాథ్, దేవరాజ్ తదితరులు కోడి పందేలకు ఉపయోగించే చాకులతో దాడి చేశారు. దాడిలో ఇద్దరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. నిందితులు పరారీలో ఉన్నారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. చిక్కబళ్ళాపుర జిల్లా ఎస్పీ కుశల్‌చౌక్సీ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం బట్లహళ్ళికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు.


అభివాదం చేస్తున్న మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి


ఊరేగింపులో మేయర్ నందీష్


జేడీఎస్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి


కాంగ్రెస్ కార్యాలయంలో..


కురుగోడులో మాట్లాడుతున్న తహసీల్దార్ నారప్ప


కప్పగల్‌లో డీఎస్ఎస్ ర్యాలీ

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

- ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి
- ఉభయ జిల్లాల్లో జయంతి వేడుకలు

బళ్లారి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్ ఏ ఒక్క కులానికి చెందిన వ్యక్తి కాదు. సమాజంలో ఉన్న అన్ని కులాలకు ఆయన మార్గదర్శమని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి నాగేంద్ర అన్నారు. అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఉభయ జిల్లాలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణాలు, గ్రామాలు, తాలూకాలు తేడాలు లేకుండా వాడవాడల్లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి నాయకులు అర్పించారు. దళిత నాయకులు ముండ్రిగి నాగరాజు, మానయ్య తదితరులు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నగరంలో పెద్దఎత్తున సాగింది. అనంతరం మున్సిపాల్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగంతోనే అందరూ హక్కులు అనుభవిస్తున్నామన్నారు. మాజీ మంత్రి బి. నాగేంద్ర మాట్లాడుతూ అంబేడ్కర్ లేకుంటే మనం ఈరోజు ఇంత స్వేచ్ఛను అనుభవించవారు కాదన్నారు. ముండ్రిగి నాగరాజు, మానయ్య, వెంకటేశ్‌హెడ్డే, తదితరలు మాట్లాడారు. డీసీ మిశ్రా, ఎస్పీ శోభారాణి, సీఈఓ మహద్ జుబేర్, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, మించు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి సిటీ: బళ్లారి జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు మీనల్లి తాయన్న ఆధ్వర్యంలో జేడీఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

బళ్లారిరూరల్ : కప్పగల్‌లో అఖిల కర్ణాటక పరమేశ్వర్ యువసైన్యం జిల్లా అధ్యక్షుడు కప్పగల్ ఓంకారప్ప నేతృత్వంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. తాలుకాలో పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏఎస్ఐ దుర్గప్రసాద్ నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు.

కంప్లి : ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ నారప్ప పిలుపునిచ్చారు. కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో డీఎస్ఎస్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు కార్యాలయాలు, పాఠశాలల్లో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

రాయచూరు : ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గంలో పయనిస్తు ఆయన ఆశయాల సాధన కోసం కలిసికట్టుగా పని చేద్దామని రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. జిల్లాయంత్రాంగం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించి జయంతి వేడుకలు నిర్వహించారు.


బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి



పీడీహళ్లి పోలీస్ స్టేషన్‌లో..


కంప్లి అంబేడ్కర్ సర్కిల్‌లో..


ఊరేగింపులో రాయచూరు ఎంపీ కుమార్ నాయక్


మహానంది కొట్టం పాఠశాలలో


బీజేపీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి


తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.99	1,578.98
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	411	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,309	112
నీటి నిల్వ (టీఎంసీలు)	7.32	3.99

ఈతకు వెళ్లి యువకుడి మృతి


శంకర(ఫైల్)

బళ్లారిసిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన యువకుడు మృత్యువాత పడ్డాడు. హొసపేట నగరంలోని తుంగభద్ర ఎల్ఎల్‌సీ కాలువలో ఈతకు వెళ్లిన యువకుడు ఆదివారం నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. మృతుడు శంకర(17) తల్లి శుభ నగరంలోని చిత్తవాడ్గిలోని వినోభా భావే ప్రభుత్వ మోడల్ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. యువకుడు బంధువులతో కలిసి చిత్తవాడ్గి సమీపంలోని కాలువలో ఈతకు వెళ్లగా గల్లంతు అయ్యాడు. ఆదివారం మధ్యాహ్నాం ఎల్ఎల్‌సీలో మృతదేహంగా కనిపించాడు, గ్రామీణ పోలీసులు విచారణ చేపట్టారు.

నాటుసారా ధ్వంసం

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం, పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు అటవీ ప్రాంతాల్లో సోమవారం దాడులు నిర్వహించి 540 లీటర్ల నాటుసారా ఊటను, నాలుగు లీటర్ల సారాను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు.

మూడేళ్లయినా ప్రారంభించరా..?

- వృథాగా నర్సింగ్ కళాశాల భవనం
- రూ.5 కోట్ల ప్రజాధనం నిరుపయోగం

బళ్లారి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి(గోషా ఆసుపత్రి)లో డిప్లమా ఇన్ జనరల్ నర్సింగ్ కోర్సు చదివే విద్యార్థుల కోసం నిర్మించిన నూతన భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. పనులు పూర్తీ అయిపోయి మూడేళ్లు అయినా ప్రారంభించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రూ. 5 కోట్లు డిస్టిక్ మినరల్ ఫండ్(డీఎంఎఫ్) నిధులతో జిల్లా అసుపత్రి ప్రాంగణంలోనే భవనాన్ని నిర్మించారు. 2018-19 మధ్య కాలంలో ఈ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే అప్పుడు కోవిడ్ కారణంగా పనులు సాగలేదు. 2022లో పనులు పూర్తీ చేశారు. నర్సింగ్ చదివే విద్యార్థులకు సౌకర్యం బోధన, బోధనేతర సిబ్బందికి వసతులు తదితర సౌకర్యాలు ఇక్కడ ఏర్పాటు చేశారు. వీటితో పాటు సెమినార్ హాల్, సీసీ కెమెరాలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. 'గర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ బళ్లారి' అని నేమ్ ప్లేట్ కూడా వేశారు. అయితే భవన ప్రారంభంపై అధికారులు, నాయకులు దృష్టి పెట్టడం లేదు. ఇప్పటి కైనా సంబంధిత పాలకులు, అధికారుల భవనాన్ని ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.


నిర్మాణం పూర్తయిన భవనం

త్వరలో ప్రారంభిస్తాం : డాక్టర్ బసరెడ్డి



రూ. 5 కోట్ల నిధులతో నిర్మించిన భవనం పూర్తి అయ్యింది త్వరలోనే భవనం ప్రారంభించి విద్యార్థులకు అందజేస్తాం కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయిన మాట నిజమే.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

అగళి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. అగళి మండలం ఇరిగేపల్లి గొల్లహట్టి హైవేలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఏఎస్ఐ బషీర్ తెలిపిన మేరకు శిర నుంచి వైసీపీ రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి రొళ్లకు వస్తుండగా ఇరిగేపల్లి గొల్లహట్టి గ్రామానికి చెందిన మైక్ సెట్ తిమ్మరాజు అతివేగంతో వచ్చి ద్విచక్రవాహనంపై వెళుతున్న నరసింహారెడ్డిని ఢీకొన్నాడు. నరసింహరెడ్డికి తీవ్రంగా గాయపడగా కర్ణాటకలోని తుమకూరు ఆసుపత్రికి తరలించారు. గొల్లహట్టి గ్రామానికి చెందిన తిమ్మరాజు స్వల్పగాయాలతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ద్విచక్రవాహనాలను ఎస్ఐ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గోరంట్ల: మండలంలోని గంగంపల్లి సమీపంలో ఆటో ప్రమాదంలో లక్ష్మీదేవి, ధనేనాయక్ తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని పొప్పనపల్లితండాకు చెందిన సూర్యనాయక్, లక్ష్మీదేవి దంపతులు సోమవారం సొంత ఆటోలో వెళ్తుండా ప్రమాదం చోటు చేసుకుంది. లక్ష్మీదేవి తీవ్రవం గా గాయపడగా, ధనేనాయక్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే ఇరువురిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉషా చికిత్సలు చే సి, లక్ష్మీదేవిని మెరుగైన చికిత్స కోసం హిందూపురం తరలించారు.

కర్ణాటక మద్యం పట్టివేత.. ఇద్దరి అరెస్టు

మడకశిర రూరల్ : మండలంలోని టీడీపల్లి గ్రామంలోకి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు గురునాథ్ రెడ్డి. శంకర్ తెలిపారు. వారు మాట్లాడుతూ కర్ణాటక నుంచి 318 మద్యం ప్యాకెట్లు స్కూటర్‌లో తరలిస్తున్నారన్నారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలని వినతి


ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుర్రాల రాజా తదితరులు

కంప్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా పరిధిలోని బాదనట్టి గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు పోగొట్టుకున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని సామాజిక కార్యకర్త గుర్రాల రాజా కోరారు. సోమవారం కంప్లి పట్టణంలో ఎమ్మెల్యే నివాసంలో ఆయన ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ విస్తరణతో ఎంతో మంది రోడ్డున పడ్డారన్నారు. నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ అధికారులతో చర్చించి అధికారులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శేకన్న, కరెమ్మ, తిమ్మప్ప, జడెప్ప, కరియన్న తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో 289 మంది

గర్భిణుల మృత్యువాత

- కలబురగి జిల్లాలోనే అత్యధికం



బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కళ్యాణ కర్ణాటక పరిధిలోకి వచ్చే ఆరు జిల్లాల్లో గడిచిన రెండేళ్లలో 289మంది గర్భిణులు మృతి చెందినట్లు అధికార గణాంకాలు తెలుపుతుండగా, కలబురగి జిల్లాలోనే అత్యధికంగా గర్భిణులు మృతి చెందినట్లు తెలుస్తోంది. హెల్త్ హబ్ జిల్లాగా ఉన్న ఈ జిల్లాలో గర్భిణులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో అత్యధికంగా గత రెండేళ్లలో 66మంది గర్భిణులు మృతి చెందినట్లు గణాంకాలు చెబుతున్నా యి. గుల్బర్గాలో 23, చించోళి, చిత్తాపురలో తలా 9మంది, జీవర్గిలో 8, అళందలో 78, సేడంలో నలుగురు గర్భిణులు మృతి చెందినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పేర్కొంది. బళ్ళారిలో 25, సిరుగుప్పలో 11, సండూరులో ఐదుమందితో చేరి మొత్తం 41మంది, బీదర్ నగరంలో 9, బసవకళ్యాణలో 9, బాల్కి, హుమనాబాద్‌లో 7, ఔరాదాబాద్‌తో చేరి మొత్తం 34మంది గర్భిణీస్త్రీలు తనువు చాలించారు. రాయచూరులో 14, మాన్విలో 12, దేవదుర్గలో 8, సింధనూరులో 7, లింగసూగూరులో 6 మందితో చేరి రాయచూరు జిల్లాలో 47మంది మృతి చెందారు. విజయనగర జిల్లా, హరపనహళ్ళిలో 16, హొసనేటలో 10, కూడ్లిగిలో 7, హడగలిలో 5, హగరిబొమ్మనహళ్ళిలో ఒకరు చొప్పున 39మంది గర్భిణులు బలయ్యారు. కళ్యాణ కర్ణాటక పరిధిలో అతి తక్కువగా కొప్పళలో నమోదు కావడం విశేషం. కొప్పళ నగరంలో, గంగావతి పట్టణంలో 10, యలబుర్గా 7, కుష్టిగిలో ఒకరితో చేరి 28మంది మృతి చెందినట్లు రికార్డుల్లో నమోదు అయ్యాయి. యాదగిరిలో 14, శహాపురలో 13, సురపులో 7మంది గర్భిణీ స్త్రీలు మృతితో 34మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రసవానికి ముందు ప్రసవం అనంతరం గర్భిణీల చావుకు ఆరోగ్య శాఖ చాలా కారణాలు జాబితా తయారు చేసింది. వాటి గర్భావస్థలో, బాలింతలుగా ఉన్న సమయంలో పలు కారణాలతో మృతి చెందినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. అధిక రక్తపీడనం, ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, హృదయ సంబంధిత రోగాలు, రక్తానికి సంబంధిత వ్యాధులు, ఎంబాలిసమ్, గర్భావస్థ, బాలింతల సమయంలో అంటువ్యాధులు, రక్త, హీనత, టీబీ న్యూమోనియా సంబంధిత వ్యాధులు, అమ్నియోటిక్ ద్రవ ఎంబాలిసమ్ (ఎఎఫ్ఇ) ఎండోటాక్సిన్ సంబంధిత కారణాల గర్భిణీ స్త్రీలు మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే చికిత్సపైనా విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఆరోగ్య విభాగంలో అస్తవ్యస్థ పాలన, అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్య సేవలు లేకపోవడం, సకాలంలో వైద్యనిపుణులు చికిత్స అందకపోవడం ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. అనుభవం లేని, నర్సులు, గర్భిణీ, బాలింతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌలభ్యాలు సమర్థవంతంగా అమలు చేయకపోవడం... లాంటి సమస్యలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

ఆరోగ్య ఆవిష్కార కింద అదనపు నిధులు

- కేకేడీబీ అధ్యక్షుడు అజయ్‌సింగ్..



కళ్యాణ కర్ణాటక ప్రాదేశిక మండలి ఆరోగ్య ఆవిష్కార పథకం క్రింద కళ్యాణ కర్ణాటక భాగంలోని ఆరోగ్య రంగానికి ఈ ఏడాది అధిక నిధులు కేటాయించినట్లు కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి అధ్యక్షులు అజయ్ సింగ్ పేర్కొన్నారు. తద్వారా ఆరోగ్య పరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు గర్భిణీల మరణాలు తగ్గుముఖం పట్టనున్నాయన్నారు. ప్రాథమిక సముదాయ ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు, 16న ముఖ్యమంత్రి సిద్దరామయ్య కలబురగిలో రూ.92 కోట్ల తో నిర్మించిన తల్లి, పిల్లల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హోసూరు జోన్


నిత్యావసరాలు అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

హోసూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శూలగిరి యూనియన్ పరిధిలోని అట్టగుర్కి గ్రామంలో ఒంటరిగా వృద్ధురాలిని హతమార్చి ఇంటికి నిప్పంటించిన ఘటనలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, నగదు అందచేశారు. మార్చి 19న జరిగిన ఘటనలో వృద్ధురాలు నాగమ్మ (63) మృతి చెందింది. నిప్పంటించడంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. ఈ నేపథ్యంలో మునిచంద్రప్ప కుటుంబాన్ని ఆదుకునేలా ఎమ్మెల్యే ప్రకాశ్ సాయం చేశారు. రూ.40వేల నగదు, ఆరు నెలలకు సరిపడా నిత్యావసరాలు సమకూర్చారు. ఈ సందర్భంగా డీఎంకే యూనియన్ కార్యదర్శి కౌన్సిలర్ నగేశ్, డీఎంకే జిల్లా కార్యదర్శి హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్‌తోపాటు మునిరాజ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నడిపించుకుని స్టేషన్‌కు తరలించడం ఏంటి?

- పోలీసుల తీరుపై వైసీపీ నాయకుల మండిపాటు

హిందూపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ సానుభూతిపరుడు మోహన్ ఇంటివద్దకు వెళ్లి ఇనుపరాడ్‌తో హల్‌చల్ చేసిన వైసీపీ నాయకుడు వాల్మీకి లోకేష్‌ను పోలీసులు నడిపించుకుని స్టేషన్‌కు తీసుకెళ్లడంపై ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారుల విలేకరులతో మాట్లాడుతూ లోకేష్‌తోపాటు నవీన్ అనే యువకుడికి బేడీలు వేసి నడింపించుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. ఇలా చేయడం సమంజసం కాదన్నారు. తప్పుచేసి ఉంటే రిమాండుకు పంపాలన్నారు. ఇలా చేయడం సబబు కాదన్నారు. దీనిపై వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడును వివరణకోరగా వాల్మీకి లోకేష్ మోహన్ ఇంటివద్దకు వెళ్లి హంగామా చేశాడు. చంపేస్తానని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం మధ్యాహ్నాం లోకేష్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నించగా మూడుసార్లు తప్పించుకునేందుకు ప్రయత్నించాడని, అంతేకాక పోలీసులపైనే తిరగబడ్డాడన్నారు. దీంతో అతన్ని అలా తీసుకురావాల్సి వచ్చిందని, అంతేకాక అతనిపై పలు కేసులు ఉన్నాయని రౌడీషీట్‌కూడా నమోదైందన్నారు. నిబంధనల ప్రకారమే అతన్ని స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు.


అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ద్రావిడర్ కజగం సభ్యులు

ఘనంగా అంబేడ్కర్ జయంతి

హోసూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని హోసూరులో వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో అంబేడ్కర్ జయంతిని సమానత్వ దినోత్సవంగా ఆచరించనున్నట్టు ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హోసూరు కార్పొరేషన్ మేయర్ సత్య, జిల్లా కౌన్సిల్ ఛైర్మన్ యువరాజ్, జిల్లా ఉపకార్యదర్శి చిన్నస్వామి, ముఖ్యకార్యవర్గ సభ్యుడు ఎల్లో రమణి తదితరులు పాల్గొన్నారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పార్టీ నాయకులు శ్రీనివాసన్, ఆర్ముగం, కె.మాణిక్యం, నారాయణస్వామి, సెల్వం తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి


డీఎంకే ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

లియొనార్డో డావిన్సీ (జయంతి)



కళా ప్రపంచంలో పేరొందిన లియొనార్డో డావిన్సీ 1452 ఏప్రిల్ 15న ఇటలీదేశంలో జన్మించారు. పాశ్చాత్య కళాఖండాలకు పెట్టింది పేరు. శాస్త్రజ్ఞుడు, గణితజ్ఞుడు, ఇంజనీర్, శిల్పకారుడు, ఆర్కిటెక్ట్, వృక్ష శాస్త్రజ్ఞుడు, సంగీతకారుడు, రచయిత. ఆయన గీసిన 'మోనాలిసా', 'ది లాస్ట్ సప్పర్' చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరొందాయి. 1519 మే 2న కన్నుమూశారు. సృజనాత్మకతపై అవగాహన కల్పించేందుకు ఆయన జయంతిని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఆర్ట్ (ఐఏఏ) ఆధ్వర్యంలో 'వరల్డ్ ఆర్ట్ డే' నిర్వహిస్తోంది. 2012నుంచి అమలు చేస్తున్నారు.

గురునానక్ (జయంతి)



సిక్కుమత గురువు గురునానక్ 1469 ఏప్రిల్ 15న లాహోర్‌లో జన్మించారు. పది మంది సిక్కు గురువులలో తొలివ్యక్తి. హిందూ, ఇస్లామియా గ్రంథాలను చదివారు. కానీ రెండుమతాలకు భిన్నంగా సిక్కుమతాన్ని స్థాపించారు. ఆసియాఖండ వ్యాప్తంగా పర్యటించి దేవుడు ఒక్కడే (ఏక్ ఓంకార్) అని బోధించారు. నానక్ తర్వాత గురుపరంపర సాగింది. సత్యం, అహింస మార్గంలో నడవాలని చాటి చెప్పారు. ఆయన రచనలు, బోధనలు 'గురు గ్రంథ్ సాహిబ్'గా పేరొందాయి. 1539 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

ఉస్తాద్ సుల్తాన్‌ఖాన్ (జయంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత ఉస్తాద్ సుల్తాన్‌ఖాన్ 1940 ఏప్రిల్ 15న రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌లో జన్మించారు. ప్రముఖ సారంగి కళాకారుడు. శాస్త్రీయ సంగీతంలో రాణించారు. ఇండియన్ ఫ్యూజన్ గ్రూప్ 'తబలా బీట్ సైన్స్' సంస్థాపక సభ్యులు. తండ్రివద్దనే శిక్షణ పొంది 11వ యేటనే ప్రదర్శన ఇచ్చారు. 20వ ఏట ఆలిండియా రేడియో గుజరాత్‌లో కెరీర్ ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. సంగీత నాటక అకాడమీ, గోల్డ్ మెడలిస్ట్ ఆఫ్ కర్ణాటక తదితర పురస్కారాలు అందుకున్నారు. 2011 నవంబరు 27న కన్నుమూశారు.

జెఫ్రీ ఆర్చర్ (పుట్టినరోజు)



బ్రిటన్‌కు చెందిన పేరొందిన నవలా రచయిత జెఫ్రీ హోవార్డ్ ఆర్చర్ 1940 ఏప్రిల్ 15న యునైటెడ్ కింగ్‌డమ్ దేశంలో జన్మించారు. చిన్నకథలతోపాటు నాటికలు రాయడం ప్రత్యేకత. కన్సర్వేటివ్ పార్టీ డిప్యూటీ చైర్మన్‌గా, ఎంపీగా వ్యవహరించారు. ఆయన రచనలు 33 భాషలలో 97 దేశాలలో ప్రచురితమయ్యాయి. ఫిక్షన్ (కాల్పనిక) విభాగంలో 19సార్లు బెస్ట్ సెల్లెర్‌గా నిలిచారు. కేన్ అండ్ ఎబెల్ నవల 3.5 మిలియన్‌లకుపైగా అమ్ముడయ్యింది. ఆయన తాజా నవల 'హిడెన్ ఇన్ ప్లైయిన్ సైట్' 2020లో ప్రచురితమైంది.

ప్రపంచం మెచ్చిన సంఘసంస్కర్త అంబేడ్కర్



చిక్కబళ్ళాపుర వేడుకల్లో మంత్రి సుధాకర్ తదితరులు

చిక్కబళ్ళాపుర, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) ప్రపంచం మెచ్చిన గొప్ప ఆర్థిక నిపుణులు, సంఘసంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఉన్నతవిద్యాశాఖ మంత్రి ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ సిద్ధాంతాల వెలుగులో దేశం దిగ్విజయంగా పురోగమిస్తోందన్నారు. జిల్లా యంత్రాంగం, సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా పంచాయతీ సహకారంతో సోమవారం బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి, మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టపడి చదివిన కారణంగా అంబేడ్కర్ ఉన్నతస్థాయికి చేరారని, అపారమైన జ్ఞానాన్ని పొందారని పదుల డిగ్రీలు పూర్తి చేశారన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉందన్నారు. బెంగళూరు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో 45 ఎకరాలలో అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌ను ఇప్పటికే ప్రారంభించిందన్నారు. ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, చిక్కబళ్లాపుర జిల్లాధికారి పీఎన్ రవీంద్ర, ఎస్పీ కుశల్ చౌక్సి, బెంగళూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

విజయపుర పట్టణంలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని నాడకచేరిలో అంబేడ్కర్ జయంతి సోమవారం నిర్వహించారు. ఆర్ఐ సత్యనారాయణ, గ్రామ పాలనాధికారులు మాలా రవికుమార్, గ్రామ సహాయకులు నరసింహమూర్తి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. కాగా అస్పృశ్యత నివారణ కోసం పోరాడిన ప్రముఖులలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు అజరామరం అని అంబేడ్కర్ ఆటో స్టాండ్‌సంఘం ఆటో డ్రైవర్ వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పురసభ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర ఆటోస్టాండ్‌లో సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జగదీశ్, చిన్నకృష్ణప్ప, వెంకటేశ్, మొహ్మద్ రఫి, బోడినహళ్ళి రాజప్ప, చందేనహళ్ళి వెంకటేశ్, శివరాజ్, ఈరుళ్ళి మునికృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో వివిధ సంఘాలు అంబేడ్కర్ జయంతి నిర్వహించాయి.

సర్జాపురలో మాదిరి బస్టాండ్ నిర్మిస్తాం

దొమ్మసంద్ర: అంబేడ్కర్ ఒక సామాజికవర్గానికి పరిమితం కాలేదని మానవాళి కోసం పాటుపడిన మహనీయులని రవాణా, దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడినవర్గాలకు సమానత్వం కోసం పాటుపడ్డారన్నారు. సర్జాపుర పట్టణంలోని అంబేడ్కర్ క్రీడామైదానంలో సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఉచిత వైద్య పరీక్షా శిబిరం, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు పాటిస్తే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. స్వాతంత్ర్యానంతరం కేంద్రన్యాయశాఖ తొలిమంత్రిగా ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. కాగా సర్జాపుర బస్టాండ్‌ను హైటెక్ తరహాలో ఆధునీకరిస్తామన్నారు. స్థలం కొరత కారణంగా సమస్య ఏర్పడిందన్నారు. పంచాయతీ తగినస్థలం కేటాయిస్తే మాదిరి బస్టాండ్ రూపొందిస్తామన్నారు. ఆనేకల్, అత్తిబెలె పట్టణంలో కూడా బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షులు మమతా రమేశ్, మాజీ అధ్యక్షుడు ఎస్వై శంభయ్య, ఎస్వీ శ్రీనివాస్ బుడగప్ప, సభ్యులు మంజునాథ్ సర్జా, సతీశ్‌కుమార్, అనిల్‌రెడ్డి, కలావతి మూర్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజయపురలో ఆటోస్టాండ్ సంఘం ఆధ్వర్యంలో ..



సర్జాపురలో అంబేడ్కర్ జయంతిలో మంత్రి రామలింగారెడ్డి

ఆర్యవైశ్య సమాజానికి ప్రభుత్వం నిరంతర మద్దతు

» బయో ఎనర్జీ బోర్డు చైర్మన్ సుధీంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సమాజానికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం నిరంతరంగా ఉంటుందని రాష్ట్ర బయోఎనర్జీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ ఎస్ఈ సుధీంద్ర హామీ ఇచ్చారు. కర్ణాటక ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, దివ్యాంగులు, వితంతువులకు పించన్లు, ఉన్నత విద్య చదివేవారికి వడ్డీ రహిత రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మహాసభ అధ్యక్షుడు రవిశంకర్ మాట్లాడుతూ ఏడేళ్లుగా ఆర్యవైశ్యులలో పేద ప్రతిభావంత విద్యార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సేవలు మరింత విస్తృతం చేయదలిచామన్నారు. డిగ్రీ, పీజీ చదివే 180మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. 53మంది విద్యార్థులకు వడ్డీ రహిత రుణాలను అందించారు. 309మందికి వితంతు, 260మంది దివ్యాంగులకు నెలసరి పించన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. అమరజ్యోతి బీమాను పంపిణీ చేశారు. ఆర్‌వీ ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ డీపీ నాగరాజ్, మైసూరు రైల్వే విభాగం ఆపరేషన్ మేనేజర్ హరితలు ముఖ్యులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ కేఆర్ రవి కుమార్, సెక్రటరీ కేఆర్ కృష్ణ, కోశాధికారి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌ల పంపిణీలో బయో ఎనర్జీ బోర్డు చైర్మన్ సుధీంద్ర, రవిశంకర్ తదితరులు

బసవేశ్వర ఆశయాలపై మరింత ప్రచారం జరగాలి



వేదికపై సిద్దలింగస్వామిజీ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): విశ్వగురు బసవేశ్వర ఆశయాలపై మరింత ప్రచారం జరగాలని బసవసంచార కార్యక్రమంలో సిద్దలింగస్వామిజీ అభిప్రాయపడ్డారు. మాగడి తాలూకా అదరంగి గ్రామంలో బసవేశ్వర చైతన్యం పేరిట ప్రత్యేక కార్యక్రమం జరిపారు. నెలమంగల బసవణ్ణ దేవర మఠం సిద్దలింగస్వామిజీ ముఖ్యులుగా పాల్గొన్నారు. పన్నెండో శతాబ్ధంలోనే బసవణ్ణ సమానత్వం సాధించే దిశగా పాటుపడ్డారన్నారు. స్త్రీ పురుష కుల మతాల బేధాభిప్రాయాన్ని నిరాకరించారన్నారు. మన సంస్కృతి పరంపరపై చర్చించుకునే వాతావరణం పెరగాలన్నారు. మొబైల్‌కు బానిసలు కారాదని పిలుపునిచ్చారు. అందుకే బసవసంచార కార్యక్రమాలను పల్లెల్లో నిరం తరంగా జరుపుతున్నామన్నారు. సంగడ బండేమఠ మహాలింగస్వామిజీ, కంబాళ మఠం చన్నవీర శివాచార్యతోపాటు పలువురు పాల్గొన్నారు. ఇంటింటా వచనాల పుస్తకాలను పంపిణీ చేశారు. బసవేశ్వర చిత్రపటంతో ఊరేగారు. అదరంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమంత దేవర, బసవేశ్వర ఉత్సవాలు జరిపారు.



శిడ్లఘట్టలో ప్రసంగిస్తున్న మంత్రి ఎంసీ సుధాకర్



చింతామణిలో ప్రతిభా పురస్కారాల ప్రదానంలో మంత్రి తదితరులు

అంబేడ్కర్ భవనానికి త్వరలో శంకుస్థాపన

శిడ్లఘట్ట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్టలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ తెలిపారు. పట్టణంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఏర్పాటైన సమావేశంలో జై భీమ్ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. అంబేడద్కర్ చూపిన మార్గదర్శకాలతో దేశం పురోగతిలో సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్, కాంగ్రెస్ నాయకుడు పుట్టు ఆంజినప్ప, బీజేపీ నాయకుడు సీకల్ ఆనందేగౌడ, తహసీల్దార్ బీఎన్ స్వామి, దళిత సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గంజిగుంటె నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి: చింతామణి పట్టణంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. వివిధశాఖలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో శకటాల ఊరేగింపు సాగింది. తహసీల్దార్, వివిధశాఖల అధికారులు, నగరసభ అధ్యక్షులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కళశాలతో మహిళలు ముందుకు సాగగా డొళ్ళుకుణిత, డప్పువాయిద్యాల బృందం, గారడీ బొమ్మల కళాకారుల బృందాలు పాల్గొన్నాయి. ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు.

దళిత సేవా సంఘం ఆధ్వర్యంలో...

బొమ్మనహళ్ళి: సెయింట్‌జాన్స్ ఆసుపత్రి సమీపాన దళిత సేవాసంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ నామఫలకాన్ని ఆవిష్కరించి, అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చంద్రప్ప ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగాయి. స్థానికులకు పండ్లు, పానీయాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఇదే సందర్భంగా ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి రామలింగారెడ్డి, బెంగళూరు దక్షిణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోనిశ్ రెడ్డి, మాజీ మేయర్ మంజునాథరెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మడివాళ కూడలిలో...

భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని మడివాళ కూడలిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జైభీమ్‌సేన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఉదయం 7 గంటలకు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. మధ్యాహ్నం అంబేడ్కర్ ఊరేగింపు సందర్భంగా మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. గోవిందు, చంద్రు, మంజు, మునిరాజు, చైత్ర, తార, శీన తదితరులు పాల్గొన్నారు.



డీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



జైభీమ్‌సేన ఆధ్వర్యంలో...

20న విష్ణుసహస్రనామావళి

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాదయాత్ర సేవా కైంకర్య ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 20న ఆదివారం విష్ణుసహస్రనామావళి హోమం నిర్వహిస్తున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్ తెలిపారు. 1977లో పాదయాత్రసేవా ట్రస్టు ప్రారంభమైందన్నారు. 48ఏళ్ల మహామండలం పూర్తయిన సందర్భంగా హోమం జయనగర్ ఒకటోబ్లాక్ అయోధ్యకల్యాణమండపంలో జరుగుతుందన్నారు. చిక్కమగళూరు జిల్లా శృంగేరిలోని హరిహరపురమఠం స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. కాగా టీటీడీ గోశాలలో ఇటీవల ఆవుల మృతిపై వస్తున్న వదంతులను కొట్టిపారేశారు. వయసు పైబడిన అనారోగ్యంతో ఉండే ఆవులు మృతి చెందాయన్నారు. అయితే టీటీడీకి చెడ్డపేరు తీసుకురావాలని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దేశ విదేశాలలోని లక్షలాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు.

భావప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగం చేయొద్దు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కులమతాల మధ్య చిచ్చుపెట్టేవిధంగా వ్యాఖ్యలు చేసినా, భావప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రత్న హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కదిరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మున్వర్‌బాషా ఫేక్ పట్టాలు సృష్టించి విక్రయించి సొమ్ముచేసుకున్న ఘటనలో ఆరు కేసులు నమోదు చేశామని అన్నారు. మున్వర్‌బాషాకు నోటీసులిచ్చి స్టేషన్‌కు పిలిపించి పలు విషయాల్లో విచారణ చేశామని తెలిపారు. పోలీసులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడాడని, ఇన్‌స్పెక్టర్ మాటలను రికార్డు చేసి సోషల్ మీడియాలో ఉంచి వర్గాల మధ్య చిచ్చు పెట్టేవిధంగా వ్యవహరించడంతో ఆయనపై కేసు నమోదు చేశామని అన్నారు. హిందూపురంలో కూడా మరో కేసు నమోదు చేశామని వివరించా రు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2)లో భావప్రకటన స్వేచ్ఛతో పాటు ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించరాదనే విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని తెలిపారు. గ్రూప్ అడ్మిన్లపై కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మత, కులపరమైన రెచ్చగొట్టేవ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో కదిరి డీఎస్పీ శివన్నారాయణస్వామి, సోషల్ మీడియా సీఐ తిమ్మారెడ్డి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

తక్కువ బరువు పసికందుకు ప్రత్యేక చికిత్సలు

బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తక్కువ బరువుతోపాటు నెలలు నిండకనే జన్మించిన శిశువుకు ఎన్ఐసీయూ విభాగంలో ఉంచి రక్షించినట్టు వాసవి ఆసుపత్రి పీడియాట్రిషన్ డాక్టర్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 28వారాలకే కాన్పు జరిగిందని కేవలం 830 గ్రాములు మాత్రమే శిశువు బరువు ఉండేదన్నారు. శ్వాసకోశతోపాటు పలు సమస్యలను ఎదుర్కొనేవారన్నారు. ఇంక్యుబేటర్ ద్వారా ఆక్సిజన్ అందించామని, పౌష్టికాంశాన్ని నిరంతరంగా సమతుల్యంతో అందించామన్నారు. తక్కువ బరువుతో నెలలు నిండకనే జన్మిస్తే ఆరోగ్య సమస్యలు అధికమన్నారు. నిరంతర పర్యవేక్షణతోనే శిశుసంరక్షణ సాధ్యమన్నారు. ప్రస్తుతం చిన్నారితోపాటు తల్లి ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

సమాజ సేవకుడు బొందురామస్వామికి
అంతర్జాతీయ పురస్కారం ప్రదానం



పురస్కారంతో బొందురామస్వామి

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సమాజ సేవకుడు, కర్ణాటక తెలుగు ప్రజా సమితి సంస్థాపకులు డాక్టర్ బొందు రామస్వామికి దుబాయ్‌లో శనివారం రాత్రి కనులపండువగా జరిగిన ఒక కార్యక్రమంలో అంతర్జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కన్నడ సంస్కృతి శాఖ సహకారంతో కర్ణాటక మీడియా జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో దుబాయ్‌లోని మ్యూజియం ఆఫ్ ది ఫ్యూచర్ ప్రాంగణంలో జరిగిన వేడుకలకు దుబాయ్‌కు చెందిన పలువురు మంత్రులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. తెలుగు భాషా సంరక్షణకోసం చేస్తున్న అవిశ్రాంతకృషికి గుర్తింపుగా డాక్టర్ బొందు రామస్వామికి ప్రతిష్టాత్మక గ్లోబల్ ఐకాన్ మీడియా పురస్కారాన్ని ప్రదానం చేశారు. భూ అబ్దుల్లా గ్రూప్ చైర్మన్ డాక్టర్ భూ అబ్దుల్లా, సిద్ధరామేశ్వర మహాసంస్థానం బోవి గురుపీఠాధిపతి ఇమ్మడి సిద్దరామేశ్వర స్వామి, బెంగళూరు బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, సినీ నటి ప్రేమ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి కే రత్నప్రభ, మాజీ ఐజీపీ బిఎన్ఎస్ రెడ్డి, కాన్ఫిడెంట్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ సి.జె.రాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బొందు మాట్లాడుతూ సమైక్యాంధ్ర, రాజధాని అమరావతి పోరాటాలకు ఈ అవార్డు గొప్ప గుర్తింపుగా భావిస్తున్నట్టు తెలిపారు.

అంబేడ్కర్ పేరిట సముదాయభవనం



అంబేడ్కర్ జయంతిలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తదితరులు

ముళబాగిలు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దళిత సామాజికవర్గాల పిల్లల పెళ్లిళ్ల, ఇతర కార్యక్రమాలకోసం పట్టణంలో రూ.4కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట సముదాయ భవనం నిర్మిస్తామని త్వరలోనే మంత్రి మహదేవప్పతో భూమిపూజ చేయించనున్నట్టు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. పట్టణంలోని నేతాజి క్రీడామైదానంలో తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతిని ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం పైభాగాన రూ.75 లక్షలతో సుందరమైన గోపురం నిర్మించనున్నట్టు తెలిపారు. తాలూకాలో వసతి రహిత దళిత సముదాయాలకు ఇంటిస్థలాల హక్కుపత్రాలు త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న బజార్ రోడ్డు పేరును అంబేడ్కర్ రోడ్డుగా మార్చామన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాలు సాధ్యమన్నారు. ఇదే సందర్భంగా రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. వివిధ రంగాల సాధకులు, దళిత పోరాట నేతలను సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ గీతా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్ నాగరాజ్, దళిత ప్రముఖులు వెంకటరవణప్ప, సంగసంద్ర విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

వారోత్సవాల్లో జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక సిబ్బంది సేవలు వెలకట్టలేనివని జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు కొనియాడారు. సోమవారం జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో వారోత్సవాలను నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు, అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. అగ్నిమాపక శాఖ సిబ్బంది పగలు, రాత్రి తేడా లేకుండా ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తారని కొనియాడారు. అగ్ని ప్రమాదాల నుంచి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా వారు చేసే సేవలు అభినందనీయం అన్నారు. ఈనెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి అన్ని వర్గాల వారికి అవగాహన కల్పిస్తామని అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డి తెలిపారు. న్యాయాధికారి శ్రీనివాసులు చేతుల మీదుగా వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి నగరంలోని ప్రధాన రోడ్లలో ర్యాలీ చేపట్టి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఎఫ్ఓ లింగమయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తునప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీ సారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్ల ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్టు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్‌ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్‌ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫోటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంతకల్లు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని ధర్మవరం స్టేషన్‌లో యార్డు ఆధునికీకరణ పనులు చేపడుతున్న కారణంగా పలు రైళ్లను రద్దు చేసి, మరికొన్నింటిని దారి మళ్లించినట్టు రైల్వే అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి ఈ రైళ్ల రద్దు కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలియజేశారు.

రద్దయిన రైళ్లు

తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు (నం. 57403)ను ఈనెల 16 నుంచి మే 18వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 57404)ను ఈనెల 15 నుంచి మే 19వ తేదీ వరకూ రద్దు చేసినట్లు తెలిపారు. అలాగే తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (నం. 57405) రైలును ఈనెల 15 నుంచి మే 16వ తేదీవరకూ, రిటర్న్ ట్రెయిన్ (నం. 57406)ను ఈనెల 15 నుంచి మే 17వతేదీ వరకూ, బెంగళూరు-ధర్మవరం-బెంగళూరు మెము (06596/96) రైళ్లను మే 5 నుంచి 17వ తేదీ వరకూ, గుంతకల్లు-హిందూపురం ప్యాసింజరు (నం.77213) రైలును మే 4 నుంచి 17వతేదీ వరకూ, దీని రిటర్న్ రైలు (నం. 77214)ను మే 4 నుంచి 17వ తేదీ వరకూ, తిరుపతి-అమరావతి(మహారాష్ట్ర) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 12765) రైలును మే 6, 10, 13, 17 తేదీల్లోనూ దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 12766)ను మే 5, 8, 12, 15 తేదీల్లోనూ రద్దు చేసినట్లు తెలియజేశారు. బీదర్-యశ్వంతపూర్ (నం. 16571) రైలును మే 12, 13, 15 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 16572)ను మే 12, 13, 14, 16 తేదీల్లోనూ, లాతూరు-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 16583)ను మే 14, 16, 17 తేదీల్లోనూ, లాతూరు-యశ్వంతపూర్ (నం. 16584) ఎక్స్‌ప్రెస్‌ను మే 15వ తేదీన, షోలాపూర్-హసన్ (నం. 11311) ఎక్స్‌ప్రెస్‌ను మే 11, 16 తేదీల్లో, దీని రిటర్న్ రైలు (నం. 11312)ను మే 12, 17 తేదీల్లోనూ రద్దు చేసినట్లు వివరించారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు

నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (ఎనం. 17247) రైలును ఈ నెల 15 నుంచి మే 16వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17248)ను ఈనెల 16 నుంచి మే 17 వరకూ కదిరి-ధర్మవరం మధ్యన పాక్షికంగా రద్దుపరచి కేవలం నరసాపూర్-కదిరి మధ్య నడపనున్నట్లు తెలిపారు. మచిలీపట్టణం-ధర్మవరం డెయిలీ ఎక్స్‌ప్రెస్ (నం 17215) రైలును మే 1 నుంచి 16వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17216)ను మే 2 నుంచి 17 వరకూ అనంతపురం-మచిలీపట్టణం మధ్య సెక్షన్‌లో మాత్రమే నడపనున్నట్లు తెలిపారు.

స్వామీ.. క్షమించు.!

ఖాద్రీశుడి ఆలయంలో ఇష్టారాజ్యం


అమ్మృతవల్లి సదన్

"కదిరి లక్ష్మీనారసింహుడి క్షేత్రం ఈఓ కార్యాలయం ప్రక్షాళన కోసం ఎదురు చూస్తోంది. ఆలయంలోని పలు విభాగాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహారం నడుస్తోంది. ఆలయ దుకాణాల్లో అధిక ధరలతో భక్తులను దోపిడీ చేస్తున్నారు. భక్తులకు వసతులు కల్పించాల్సిన ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు గడిచిన బ్రహ్మోత్సవాల సేవల్లో లోపాలే మంచి ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఆలయ అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్లే బ్రహ్మోత్సవం రోజున రథం యథాస్థానానికి చేరడానికి ఏడు గంటలకు పైగా సమయం పట్టింది. ఏడాది కాలంగా ఆలయ ధర్మకర్తల కమిటీ లేకపోవడం కూడా సేవల్లో లోపాలు, అధికారుల్లో ఉదాశీనతకు కారణంగా తెలుస్తోంది."

- పలుకుబడి ఉంటే సత్వర దర్శనం
- అధిక ధరలతో భక్తుల దోపిడీ
- ఆలయంలో పడకేసిన పారిశుధ్యం
- గదుల కేటాయింపులో చేతివాటం
- ప్రక్షాళన కోసం భక్తుల ఎదురుచూపు?

కదిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనారసింహుడి ఆలయంలోని పలు విభాగాల్లో వివిధ స్థాయిల్లో అధికారులు, ఉద్యోగు లు పనిచేస్తున్నారు. ముఖ్యంగా లడ్డూ ప్రసాదం, అన్నదానం, సెక్యూ రిటీ, పారిశుధ్యపనులు, కల్యాణ కట్ట, గదుల కేటాయింపులు, వివిధ రకా ల దుకాణాలు ఇలా అనేక విభాగాలు ఉన్నాయి. వీటన్నింటిని నియంత్రించడానికి ఆలయ కార్యనిర్వహణాధికారి(ఈఓ) ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో ఈ విభాగాల్లో ఉద్యోగులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు భక్తులు చెబుతున్నారు. ఏదైనా సమస్యపై అడుగుదా మంటే సమాధానం చెప్పేవారే లేరని పలువురు వాపోతున్నారు. ప్రతి దాన్ని డబ్బు దృష్టితోనే చూస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


లడ్డులు తయారు చేస్తున్న దృశ్యం

కానరాని అన్నదానం రసీదులు


అన్నదానానికి భక్తులు ఇచ్చిన బియ్యం

అన్నదానానికి ఎంతో మంది భక్తులు బియ్యం, బేడలు, ఇతర వస్తువులు వితరణ చేస్తుంటారు. వారందరికి రసీదు ఇవ్వాలి. బ్రహ్మోత్సవాల సమయంలో వందల కిలోల బియ్యం, ఇతర సరుకులు ఇచ్చినా వాటికి రసీదులు ఇవ్వలేదని పలువురు భక్తులు చెబుతున్నారు. అలాగే అన్నదాన సత్రం చిన్నది కావడం వల్ల భక్తులకు అసౌకర్యంగా ఉంది. అన్నదాన సత్రాన్ని ఆధునికీకరించాలని భక్తులు కోరుతు న్నారు.

లడ్డూలో కొరవడిన నాణ్యత

ఆలయానికి వచ్చే భక్తులకు శ్రీవారి దర్శనం తర్వాత అతి ముఖ్యమైనది లడ్డూ ప్రసాదం. భక్తులు ఎంతో పవిత్రమైదిగా లడ్డూను భావిస్తారు. అలాంటి లడ్డూలో గత కొంతకాలంగా నాణ్యత కొరవడిందని భక్తులు చెబుతున్నారు. ఇక్కడ రెండు రకాల లడ్డూలు తయారవుతున్నాయని భక్తులు చెబుతున్నారు. లడ్డూ తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని భక్తులు చెబుతున్నారు. దొడ్ల కాని హెరిటేజ్ కంపెనీ నెయ్యి వాడాల్సి ఉండగా ఇతర కంపెనీల నెయ్యి వాడుతున్నట్లు సమాచారం. టోకన్లు లేకుండానే లడ్డూ ప్రసాదం అమ్ముతున్నట్లు తెలిసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎన్ని లడ్డూలు తయారుచేశారు? ఎన్ని అమ్మారో లెక్క పత్రం లేకుండా పోయినట్లు తెలుస్తోంది.

ఆలయ దుకాణాల్లో అధిక ధరలు


ఆలయంలో ఉన్న చెప్పులషాపు, లగేజీ కౌంటర్

ఆలయ ఆధ్వర్యంలో పలు దుకాణాలు ఉన్నాయి. వీటికి సంవత్సరానికి ఒకసారి టెండర్లు నిర్వహించి, హెచ్చు పాటదార్లకు కేటాయిస్తారు. టెంకాయలు, చెప్పులు షాపు, సెల్‌ఫోన్ లాకర్, బొమ్మల స్టాల్ వంటివి ఉన్నాయి. ప్రస్తుతం టెంకాయల షాపు టెండర్ కాలం ముగియడంతో విక్రయించలేదు. చెప్పుల షాపునకు సమయం ముగిసినా కొనసాగిస్తు న్నారు. ఇక్కడ జతకు రూ.5 తీసుకోవాల్సి ఉండగా రూ.10 తీసుకుంటు న్నారు. సెల్‌ఫోన్, బ్యాగులలాకర్‌లో ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. సెల్‌ఫోన్‌కు రూ. 5 వసూలు చేయాల్సి ఉండగా రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. ఇక బ్యాగులకైతే రూ.10 వసూలు చేయాల్సి ఉండగా రూ. 40 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీని భక్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని భక్తులు వాపోతున్నారు.

సెక్యూరిటీ చేతివాటం

సెక్యూరిటీ సిబ్బంది నిర్వాకం వల్ల ఆలయంలో సామాన్య భక్తులు స్వామివారి దర్శనానికి గంటలకొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. అయితే పలుకుబడి ఉన్న వారిని మాత్రం క్షణాల్లో స్వామి వారి చెంతకు సెక్యూరిటీ సిబ్బంది చేరుస్తున్నట్లు భక్తులు వాపోతున్నారు. ముఖ్యంగా కర్ణాటక నుంచే వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నట్లు చెబుతున్నారు. కొంతమంది సెక్యూరిటీ గార్డులు చేతి వాటం ప్రదర్శించి వచ్చిన వారిని దర్శనానికి తీసుకెళుతున్నట్లు సమాచారం.

పారిశుధ్యం... అధ్వానం

ఆలయంలో పారిశుధ్యం పడకేసినట్లు భక్తులు చెబుతున్నారు. ఆలయానికి సంబంధించిన గదుల్లో మరుగుదొడ్లు ఉపయోగించడానికి వీలు లేకుండా ఉంటాయని చెబుతున్నారు. అన్నదాన సత్రం పక్కన ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లు కూడా భక్తులు వినియోగించలేని స్థితిలో ఉన్నాయి. నీళ్లు రాకపోవడం, శుభ్రం చేయకపోవడంతో భక్తులు వాటిలోకి వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు.

ఆఫ్‌లైన్‌లోనే గదులు..

ఆలయంలో దాదాపు 75గదుల వరకు భక్తుల వసతి కోసం ఉన్నాయి. ఇందులో ఆలయంలో 28, అమృతసదన్‌లో మరో 30 గదులు, మరో 10 గదులు ఆలయానికి సమీపంలో ఉన్నాయి. ఇవన్నీ ఆఫ్‌లైన్‌లోనే తీసుకోవాలి. దూర ప్రాంతాల నుంచి వీటిని ముందస్తుగా బుక్ చేసుకోవడానికి వీలు లేదు. భక్తులు ఎవరు ముందుగా వస్తే వారికి గదులు కేటాయిస్తున్నారు. ఇందులో కూడా పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని భక్తులు వాపోతున్నారు. ఒక గది తీసుకున్నవారు 24 గంటల కంటే ముందే ఖాళీ చేసి ముందు వెళితే వారి గదిని అనధికారికంగా ఇతరులకు కేటాయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. గతంలో కూడా ఇది పెద్ద ఎత్తున జరిగినట్లు తెలిసింది. కేవలం ఆన్‌లైన్ లేకపోవడం వల్లే ఇటువంటి జరుగుతున్నాయి.

వసతుల్లేని కల్యాణకట్ట

ఆలయం ఆధ్వర్యంలో కల్యాణకట్ట(తలనీలాలు ఇచ్చే ప్రదేశం)ను అమృతసదన్‌లో నిర్వహిస్తున్నారు. అక్కడ భక్తులు స్నానం చేయడానికి కూడా సరైనా వసతులు లేవు. భక్తులు స్నానం చేసిన నీళ్లు బయటకు వెళ్లాడానికి వీలు లేకుండా ఉంది. నీరు



నిల్వ ఉండి కంపు కొడుతున్నాయి. మహిళలు స్నానం చేసిన తరువాత దుస్తులు మార్చుకోవడానికి సరైన సౌకర్యం లేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.